డిజైర్ సొసైటీలో ఎయిడ్స్ డే

బొల్లారం, డిసెంబర్ 2: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర ఆదేశాల మేరకు బొల్లారం మున్సిపల్ డిజైర్ సొసైటీలో నిర్వహించిన ఎయిడ్స్ డే వేడుకల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ ఒకటో తేదీన ఎయిడ్స్‌డే నిర్వహిస్తారని, ఎయిడ్స్‌పై అవగాహన లేక చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. దీనికి నివారణ ఒక్కటే మార్గమన్నారు. సొసైటీలో హెచ్ఐవీకి గురైన చిన్నారులకు మంచి పోషణ గల ఆహారం, వారి హక్కులకు భంగం కలిగించకుండా జాగ్రత్తలు పాటించాలని నిర్వాహకులకు సూచించారు.

హెచ్ఐవీ బాధిత చిన్నారులతో జడ్జి రమేశ్

ఎయిడ్స్ భూతాన్ని తరిమేద్దాం

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 2: సమాజం నుంచి ఎయిడ్స్ భూతాన్ని తరిమికొడదామని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌కు మందు లేదని, నివారణే మార్గమని స్పష్టం చేశారు.

మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాలి

బొల్లారం, డిసెంబర్ 2: ప్రభుత్వం మట్టి, ఇసుక రవాణాపై కఠిన నిబంధనలు విధించినా మట్టి మాఫియా యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నా పట్టించుకోవడంలేదని విమర్శలు వస్తున్నాయి. జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలోని అలీనగర్ గ్రామంలోని సర్వే నంబర్ 79 భైరవ కుంట, చిన్న కుంటల్లోని ప్రభుత్వ భూమిలో రాత్రి వేళల్లో పెద్దఎత్తున టిప్పర్లతో అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారుల కళ్లుగప్పి ప్రభుత్వ భూమిలో నుంచి మట్టిని గడ్డపోతారం పారిశ్రామిక వాడ, రంగారెడ్డి జిల్లాలోని గగిలాపూర్, గండి మైసమ్మ ప్రాంతాలకు తరలిస్తూ అక్రమార్కులు పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్న కుంట వద్ద మట్టి తోడిన దృశ్యం

తుఫాన్ ప్రభావంతో జల్లులు

న్యాల్‌కల్ మండలం హద్నూర్‌లో కురుస్తున్న వర్షం

జహీరాబాద్, డిసెంబర్ 2: ఫెయింజల్ తుఫాన్ ప్రభావంతో జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో సోమవారం రాత్రి జల్లులు కురిశాయి. నియోజవర్గంలోని జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్ తదితర మండలాల్లోని గ్రామాల్లో వర్షం కురిసింది. తుఫాను ప్రభావంతో మేఘాలు కమ్ముకొని చలి తీవ్రత తగ్గడంతో ప్రజలు కాస్త చలి నుంచి ఉపశమనం పొందారు. ఫలితంగా ఆయా మండలాల పరిధిలో చేతికి వచ్చిన పత్తిని తీసేందుకు ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. చెరుకు పంటను ఫ్యాక్టరీకి క్రషింగ్‌కు తరలించేందుకు ఇబ్బందులు తప్పవని రైతులు అంటున్నారు.

సీఎం కప్పు క్రీడలు నిర్వహించాలి

సిర్గాపూర్, డిసెంబర్ 2: గ్రామస్థాయిలో సీఎం కప్పు క్రీడల నిర్వహణ సవ్యంగా నిర్వహించాలని ఎంపీడీవో మల్సూర్‌నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని పాఠశాలల పీఈటీలకు కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈనెల 7, 8 తేదీల్లో గ్రామ స్థాయిలో 10, 11, 12 తేదీల్లో మండల స్థాయిలో నిర్వహించాలన్నారు. వాలీబాల్, కబడ్డీ, కోకో, ఫుట్ బాల్, అథ్లెటిక్స్ వీటికి సంబంధించి గ్రామాల్లో సవ్యంగా చేపట్టాలన్నారు. తహసీల్దార్ ఉమాశంకర్, ఎంపీవో బ్రహ్మంచారి, ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కొట్టిన ప్రిన్సిపాల్!

అందోల్, డిసెంబర్ 2: మండల కేంద్రం వట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న నవీన్‌ను హోంవర్కు సరిగా చేయడంలేదని ప్రిన్సిపాల్ కొట్టడంతో తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేశారు. ఎంఈవో గోవింద్‌రెడ్డి, ఎస్సై విఠల్ అక్కడికి చేరుకొని ప్రిన్సిపాల్, విద్యార్థి, తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థిని కొట్టడం తప్పేనని.. ఇకపై ఇలాంటివి జరుగుకుండా చూస్తానని ప్రిన్సిపాల్ హామీపత్రం రాసి ఇవ్వండతో తల్లిదండ్రులు శాంతించారు. అనంతరం ఎంఈవో విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలలో తరగతి గదులు, ఇతర వసతులు పరిశీలించారు. పలు విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా: ఒకరి మృతి

కోహీర్, డిసెంబర్ 2: ప్రమాదవశాత్తు కారు డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని కవేలి శివారులోని 65వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అవతలి వైపున బోల్తా పడింది. జహీరాబాద్ నుంచి సంగారెడ్డి వైపునకు వెళ్తున్న క్రమంలో ప్రమాదం సంభవించింది. కారు బోల్తా పడిన వెంటనే దాన్ని జహీరాబాద్ వైపునకు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో కారు నుజ్జునుజ్జయ్యింది. ఘటనా స్థలంలోనే ముత్తంగి గ్రామానికి చెందిన అశోక్(45) మృతిచెందాడు. కారులో ఉన్న డాకూర్ గ్రామానికి చెందిన శ్రీశైలం, ముత్తంగికి చెందిన జగన్‌రెడ్డికి తీవ్ర తీవ్రగాయాలు కావడంతో జహీరాబాద్ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ముగ్గురు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం.

మైత్రీ ట్రాన్స్ క్లినిక్ ఏర్పాటు హర్షణీయం

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 2: ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి జిల్లాలో మైత్రీ ట్రాన్స్ క్లినిక్ ఏర్పాటు చేయడం హర్షించదగిన విషయమని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి చేసుకున్న నేపథ్యంలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్ విధానంలో నర్సింగ్ కళాశాలలు, ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌లను ప్రారంభించారు. ఈ క్రమంలో జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానలో కలెక్టర్ మైత్రీ ట్రాన్స్ క్లినిక్‌ను అదనపు కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లకు ప్రతి గురువారం ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయని, అందుకోసం ఓపీ విభాగంలో ఒక మెడికల్ ఆఫీసర్, ఒక కౌన్సిలర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి లలితాకుమారి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సుధా మాధురి, ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

ట్రాన్స్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ క్రాంతి

పేరుకే పెద్దబడి

- మూడు భాషల మీడియాలున్నా ఆదరణ అంతంతే..
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రైవేటును ఆశ్రయించిన విద్యార్థులు
- వచ్చే ఏడాది బడికి తలుపులు పడేలా విద్యార్థుల సంఖ్య

కవేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కోహీర్, డిసెంబర్ 2: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గుతున్నది. 40 ఏండ్లుగా నిర్విరామంగా కొనసాగిన తరగతులు నేడు చరమాంకానికి చేరాయి. పేరుకు పెద్దబడి అని చెప్పుకొనే ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. పదో తరగతి తెలుగు మీడియం, ఇంగ్లిష్ మీడియంలో ఒక్క విద్యార్థి లేకపోవడం విస్తుగొలుపుతున్నది. పదో తరగతి ఉర్దూ మీడియం పదో తరగతిలో తొమ్మిది మంది మాత్రమే విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని కవేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దుస్థితి ఇందుకు నిదర్శనం.

తెలుగు కనుమరుగు.. ఇంగ్లిష్‌కు ఆధరణ కరువు

కవేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ మీడియంలో ఆరో తరగతిలో 16, ఏడులో 13, ఎనిమిదిలో 16, తొమ్మిదో తరగతిలో 35మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉర్దూ మీడియం ఆరో తరగతిలో ఏడుగురు, ఏడో తరగతిలో ఎనిమిది మంది, ఎనిమిదిలో ఆరుగురు, పదో తరగతిలో తొమ్మిది మంది విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం తెలుగు, ఇంగ్లిష్ మీడియం పదో తరగతిలో ఒక్కరూ లేరు. ఉర్దులో పదో తరగతిలో తొమ్మిది మంది తరగతులకు హాజరవుతున్నారు. వచ్చే సంవత్సరానికి ఉర్దూ మీడియంలో ఒక్కరుకూడా చేరని పరిస్థితి కనిపిస్తున్నది. ఎందుకంటే తొమ్మిదో తరగతిలో ఉర్దూ మీడియంలో ఒక్క విద్యార్థి కూడా లేరు. దీంతో 2025విద్యా సంవత్సరం పదో తరగతిలో తెలుగు మీడియం, ఉర్దూ మీడియం కనుమరుగు కానున్నాయి. గతేడాది తెలుగు మీడియంలో పది మంది వార్షిక పరీక్ష రాశారు. ప్రస్తుతం తెలుగు మీడియంలో ఇదే చివరిది కానుంది. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఏ ఒక్క క్లాసులో కూడా తెలుగు మీడియం విద్యార్థులు లేరు. దీంతో కవేలి పాఠశాలలో తెలుగు మీడియానికి తలుపులు మూసినట్లయింది.

అధికారుల నిర్లక్ష్యం.. చేరని విద్యార్థులు

విద్యార్థుల సంఖ్యను పెంచడంలో విద్యాశాఖాధికారులు ఘోరంగా విఫలమయ్యారు. కవేలి జడ్పీ ఉన్నత పాఠశాలలో మొత్తం 13 మంది ఉపాధ్యాయులున్నారు. ఇంగ్లిష్ మీడియంలో 80 మంది, ఉర్దూ మీడియంలో 30 మంది విద్యార్థులు చదువుతున్నారు. 300 మందికి సరిపడా భవనం ఉన్నా నిరుపయోగంగా మారనున్నది. చాలా మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల బాట పట్టడంతో తెలుగు మీడియంలో విద్యార్థుల సంఖ్య కనిపించకుండా పోయింది. బడిబాట ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరించడంతోనే పాఠశాలకు ఈ దుస్థితి పట్టిందని స్థానికులు ఆరోపించారు.

విద్యార్థుల సంఖ్య పెంచుతాం

విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేసినం. కవేలి నుంచి వెంకటాపూర్ గ్రామం వరకు రోడ్డు ఉంటే అక్కడి నుంచి విద్యార్థులు వచ్చేవారు. ప్రస్తుతం 12 మంది ఉపాధ్యాయులు, పీఈటీతోపాటు మరో ఇద్దరు సిబ్బంది ఉన్నారు. ఉర్దూ మీడియం విద్యార్థులకు బోధించేందుకు తెలుగు, సాంఘిక, ఎస్జీటీ ఉపాధ్యాయుడి అవసరం ఉంది. వేరే గ్రామాల నుంచి విద్యార్థులు ఎవరూ రావడం లేదు.

- ఎలిజబెత్‌రాణి, హెచ్ఎం, కవేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కార్తిక మాస పూజలు విజయవంతం

కార్తికోత్సవం కమిటీ నిర్వాహకులకు జ్ఞాపికలను అందజేసిన వామనభట్ల ప్రకాశశర్మ

రామచంద్రాపురం, డిసెంబర్ 2: లోకకల్యాణార్థం భారతీనగర్ డివిజన్‌లోని ఎల్ఐజీ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన కార్తిక మాస పూజలు విజయవంతంగా ముగిశాయని మూడు రోజులపాటు శివకేశవుల పూజలు, యాగాలు నిర్వహించినట్లు వామనభట్ల ప్రకాశశర్మ తెలిపారు. సోమవారం నిర్వాహకులకు జ్ఞాపికలు, స్వామి వారి ప్రసాదం అందజేసి ఘనంగా సన్మానించారు. కార్తికమాస పూజలు విజయవంతం చేసినందుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేదపండితులు మూడురోజుల పాటు శివకేశవులకు ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, హోమాలు నిర్వహించారని, మూడు రోజులపాటు భక్తులకు అన్నదానం చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా కోటి రుద్రాక్షల ఊరేగింపు

రుద్రాక్షలను ఆశ్రమానికి తరలిస్తున్న విద్యాపీఠం సభ్యులు, భక్తులు

కంది, డిసెంబర్ 2: మహా శివరాత్రిని పురస్కరించుకొని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో కోటీ రుద్రాక్షలతో లింగార్చన నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. నేపాల్, వారణాసిల నుంచి తీసుకొచ్చిన కోటికి పైగా రుద్రాక్షలు సంగారెడ్డి చేరుకున్నాయి. విద్యాపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి సోమవారం రుద్రాక్షలకు పూజలు నిర్వహించి ఊరేగింపుగా ఫసల్‌వాది ఆశ్రమానికి తరలించారు. పెద్ద ట్రక్కులో వచ్చిన రుద్రాక్షలను పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి ఫసల్‌వాది ఆశ్రమం వరకు ప్రత్యేక పూజలు, భజనలు చేసుకుంటూ తీసుకెళ్లారు. దారిపొడవున భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. మహాశివరాత్రి రోజున కోటి రుద్రాక్షలతో లింగార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాపీఠం సభ్యులు తోపాజి అనంతకిషన్, భక్తులు పాల్గొన్నారు.

అదనపు పారితోషికం చెల్లించాలి

జహీరాబాద్: వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నేత మహిపాల్, ఆశ వర్కర్లు

జహీరాబాద్, డిసెంబర్ 2: ఆశ వర్కర్లకు అదనపు పారితోషికం చెల్లించి లెప్రసీ సర్వే చేయించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని క్లస్టర్ కార్యాలయంలోని సీహెచ్‌వో రవికి ఆశ వర్కర్ల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశ వర్కర్లకు లెప్రసీ సర్వే అప్పుజెప్పడమేమిటని ప్రశ్నించారు. ఆశ వర్కర్లకు అదనపు పారితోషికం చెల్లించిన తర్వాతే సర్వే పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల సీఐటీయూ యూనియన్ అధ్యక్షురాలు శశిరేఖ, ఉపాధ్యక్షురాలు నందమ్మ పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల ఆందోళన

సిర్గాపూర్, డిసెంబర్ 2: ఆశ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, పోలియో డబ్బులు చెల్లించాలని సోమవారం సిర్గాపూర్ పీహెచ్‌సీ ఎదుట నారాయణఖేడ్ సీఐటీయూ ఏరియా కార్యదర్శి రమేశ్ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 2 నుంచి లెప్రసీ సర్వే చేపట్టాలని ఆశలకు సూచిస్తున్నారని, పెండింగ్‌లో ఉన్న డబ్బులు చెల్లించాకే కొత్త సర్వేలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ అధ్యక్షురాలు భారతి, అంబిక, సాయవ్వ, నాగమణి, లక్ష్మి స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

సిర్గాపూర్: ఆందోళన చేస్తున్న ఆశ వర్కర్లు

గీతం స్కాలర్ మంగపతికి డాక్టరేట్

పటాన్‌చెరు, డిసెంబర్ 2: గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం, హైదరాబాద్‌లోని గణితశాస్త్ర విభాగం, పరిశోధక విద్యార్థి మంగపతి నేరుకొండ డాక్టరేట్‌కు అర్హత సాధించారు. వివిధ రకాల మెట్రిక్ స్పేస్‌లలో అప్లికేషన్లతో స్థిర పాయింట్ సొల్యూషన్స్‌పై ఒక అధ్యయనం అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రామకోటేశ్వరరావు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

ఎస్టీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో

జహీరాబాద్, డిసెంబర్ 2: జహీరాబాద్ పట్టణంలోని ఎస్టీ బాలుర వసతి గృహాన్ని సోమవారం రాత్రి జహీరాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారి రాంరెడ్డి తనిఖీ చేశారు. నిత్యావసర సరుకుల గడువును పరిశీలించారు. తాజా కూరగాయలతో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని ఆదేశించారు. వంటశాల, పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వసతి గృహం పరిసరాల్లో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం లేకుండా చూడాలన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు

జహీరాబాద్, డిసెంబర్ 2: నిత్యం పని ఒత్తిడితో ఆరోగ్యంపై శ్రద్ధ తగ్గిపోయే అవకాశాలున్న నేపథ్యంలో డ్రైవర్లు, కండక్టర్లు సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆర్టీసీ రీజినల్ వైద్యాధికారి డాక్టర్ శృతి ఆధ్వర్యంలో డ్రైవర్లు, కండక్టర్లకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటారు.

పాస్టర్స్ నూతన కార్యవర్గం ఎంపిక

రామచంద్రాపురం, డిసెంబర్ 2: భారతీనగర్ డివిజన్ ఐక్య పాస్టర్స్, ఇవాంజెలిస్ట్ ప్రేయర్ ఫెలోషిప్‌కి సంబంధించిన నూతన కార్యవర్గ కమిటీని సోమవారం ఎంపిక చేశారు. నూతన పాస్టర్స్ కమిటీ అధ్యక్షుడిగా పాస్టర్ పి.శ్యాంబాబు, ఉపాధ్యాక్షుడిగా ఎం.ప్రదీప్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా పాస్టర్ పి.క్రీస్తుదాసును కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నారాయణఖేడ్, డిసెంబర్ 2: మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సోమవారం నారాయణఖేడ్ పట్టణానికి చెందిన పలువురిని కలిసి పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన సయ్యద్ మహతబ్‌పటేల్, మారుతిరావు, రిజ్వాన్, అబ్దుల్ ఖాదర్ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

కంకర క్వారీల ఏర్పాటు వద్దు

కలెక్టరేట్ ఎదుట నల్తూరు గ్రామస్తుల ధర్నా

బొల్లారం, డిసెంబర్ 2: కొత్త కంకర క్వారీల ఏర్పాటు పనులను వెంటనే నిలిపివేయాలంటూ జిన్నారం మండలం న ల్తూరు గ్రామస్తులు ధర్నా చేశారు. సోమవా రం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. గ్రామంలోని సర్వే నంబర్ 160 లో ప్రారంభించిన కంకర క్రషర్ ఏర్పాటు పనులను వెంటనే నిలిపివేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నెల ఒకటిన జరుగుతున్న పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ మేరకు గ్రామ సభను నిర్వహించి తీర్మానం చేశారు. ప్రజల ఆకాంక్షల మేరకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో పరమేశం, జిల్లా మైనింగ్ శాఖ అధికారులకు గ్రామస్తులు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం జిన్నారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఎదుట కంకర క్రషర్ నిర్మాణ పనులు ఆపివేయాలంటూ ధర్నా చేసి తహసీల్దార్ భిక్షపతి, సీఐ నయీముద్దీన్‌కు వినతిపత్రాలు అందజేశారు.

కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో ధర్నా చేస్తున్న నల్తూరు గ్రామస్తులు

బ్యాంకు రుణాలు ఇప్పించాలి

జహీరాబాద్, డిసెంబర్ 2: బ్యాంకు నుంచి రుణాలు ఇప్పించాలని న్యాల్‌కల్ మండలంలోని మామిడ్గి గ్రామానికి చెందిన నిమ్జ్ భూబాధితులు డిమాండ్ చేశా రు. సోమవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డికి మామిడ్గి గ్రామానికి చెందిన నిమ్జ్ భూబాధితులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమ్జ్‌లో తమ భూములు ఉండడంతో కోత్తూర్(బి) కెనరా బ్యాంకు అధికారులు రుణాలు ఇవ్వమంటున్నారని వాపోయారు. నిమ్జ్ జాబితాలో తమ పట్టా భూములుండడంతో ఇతరులకు అమ్ముకునేందుకు వీలు లేకుండా పోయిందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని నిమ్జ్ జాబితా నుంచి తమ భూముల సర్వే నంబర్లు తొలిగించాలని కోరారు. లేని పక్షం లో బ్యాంకు ద్వారా రుణాలైన ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డీటీ రాజిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మామిడ్గి నిమ్జ్ భూబాధితులు

ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా సంక్షేమమే..

నారాయణఖేడ్, డిసెంబర్ 2: పదవి లేకపోయినా సమర్థవంతంగా ప్రతిపక్ష పాత్రను పోషిస్తూ ప్రజల కష్టసుఖాల్లో పాల్గొంటున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పనితీరును కొనియాడుతూ సోమవారం నారాయణఖేడ్ మండలం ర్యాకల్‌లో పలువురు సీఎం సహాయనిధి లబ్ధిదారులు కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి సహకారంతో ర్యాకల్‌కు చెందిన గైని చంద్రమ్మకు రూ.45 వేల సీఎం సహాయ నిధి చెక్కును మంజూరు చేయగా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు రవీందర్‌నాయక్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, సాయాగౌడ్, గోపాల్‌రెడ్డి, నర్సింహులు ఉన్నారు.

కేసీఆర్ సహా బీఆర్ఎస్ నేతల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

పాఠశాలలో గ్రంథాలయం ప్రారంభం

కోహీర్, డిసెంబర్ 2: మండలంలోని బిలాల్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో రూమ్ టు రీడ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని తహసీల్దార్ బాలశంకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో నాలుగు సంవత్సరాలపాటు విద్యార్థుల చదువుల కోసం 777 పుస్తకాలు, ఇన్‌స్ట్రక్షన్ ప్రోగ్రాం గురించి సామగ్రిని అందించడం శుభపరిణామమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేశ్, కాంప్లెక్స్ హెచ్ఎం ఆనందం, కార్యదర్శి శ్వేత, అండాలు, నిర్మలాదేవి, మృదుల, సింహాచలం, వినోద, ఆసిఫా బేగం, సుల్తానాబేగం, సునిత, సంధ్య పాల్గొన్నారు.

బిలాల్‌పూర్ పాఠశాలలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ బాలశంకర్

బడంపేటలో వ్యక్తిపై దాడి.. ఉద్రిక్తత

హత్నూర, డిసెంబర్ 2: మండలంలోని బడంపేటలో సోమవారం వ్యక్తిపై దాడి చేయడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొమురయ్య నెల క్రితం రొటవేటర్ కిందపడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆ సమయంలో గ్రామానికి చెందిన రవి, జనార్దన్ అక్కడే ఉండడంతో కుటుంబీకులు వారిపై అనుమానం వ్యక్తం చేశారు. దీంతో గ్రామంలో పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టి కొమురయ్య కుటుంబానికి కొంత భూమి ఇవ్వాలని ఒప్పించారు. భూమి రిజిస్ట్రేషన్ చేసివ్వాలని మృతుడి కుటుంబీకులు కోరగా ఒప్పుకోకపోవడంతో కోపోద్రిక్తులైన మృతుడి కుటుంబీకులు సోమవారం రవి పొలాన్ని దున్నడానికి వెళ్లారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న హత్నూర ఏఎస్ఐ దుర్గయ్య సిబ్బందితో గ్రామానికి చేరుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పడంతో గొడవ సద్దుమనిగింది.

బడంపేటలో ఇరువర్గాలతో మాట్లాడుతున్న ఏఎస్ఐ దుర్గయ్య

జీపీలకు నిధులు విడుదల చేయాలి

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 2: గ్రామ పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరుతూ టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం నాయకులు కలెక్టర్, డీపీవోలకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సందిల బలరాం మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీలకు నిధులు విడుదల కాకపోవడంతో ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్, అదనపు కలెక్టర్, డీపీవోల దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేసి పంచాయతీల నిర్వహణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ, సహ అధ్యక్షుడు వెంకట రెడ్డి, సెంట్రల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు మల్లిఖార్జున్, ఇమ్రాన్, జగన్, శ్రీనివాస్, అరుణ్, విఘ్నేశ్, వినయ్, సుమన్ పాల్గొన్నారు.

కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 2: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారులకు అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజావాణిలో మొత్తం 43 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్‌తో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మజా రాణి, ఏవో పరమేశ్ పాల్గొన్నారు.